క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు మధుకుమార్ శర్మ మంత్రోచ్చరణ మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధనకు రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూమిరెడ్డి ఎర్రయ్యమ్మ, కమిటీ సభ్యులు అల్లు గౌరినాయుడు, అల్లు వెంకటరావు, గుమ్మడి రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ ఆరుద్ర

గుర్ల: చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించేలా తల్లులకు అవగాహన కల్పించాలని గరివిడి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఆరుద్ర సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చిన్నారులకు తల్లి పాలతో పాటు అవసరమైన పౌష్టికాహారం అందించే విధంగా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఏ చిన్నారీ పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

9న ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో తాడి నరేంద్రకుమార్ జ్ఞాపకార్థం ఈ నెల 9న ఉత్తరాంధ్ర స్థాయిలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. డే అండ్ నైట్ నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న జట్లు రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేత జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.8 వేలు నగదు ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు.


పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



కొట్యాడలో ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్న వసతులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. మెరుగైన బోధనతో పాటు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, బూట్లు, యూనిఫాం దుస్తులు, పౌష్టికాహారం, వంటివి అందిస్తున్నట్లు చెప్పారు. వాటిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం



బహుమతులు అందిస్తున్న జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాజు, తదితరులు

శృంగవరపుకోట: పట్టణంలోని నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో నెల రోజులుగా నిర్వహిస్తున్న బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. 18 సంవత్సరాలుగా దాతల సహకారంతో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ మెరికల్లాంటి క్రీడాకారులను తయారు చేస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులను ఉత్తమంగా తీర్చిదిద్దడంలో చీఫ్ కోచ్ శ్రీరాములు కృషి అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఇటీవల నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ మళ్ల వేణు, నారాయణ స్కూల్ ఏజీఎం శ్రీనివాసరావు, మంథా సుబ్బారావు, వి.మురళి, జె.విజయరామరాజు, డి.వి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవిద్దాం..
పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



హాజరైన కార్యకర్తలు, నాయకులు

- వైఎస్సార్‌సీపీ రీజనల్ డిప్యూటీ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు
- ఎన్నికల్లో కార్యకర్తల సహకారం మరువలేనిది : మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- కార్యకర్తలకు అండగా ఉంటాం : మాజీ ఎంపీ బెల్లాన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి, ఓటమికి నిరుత్సాహపడకుండా పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారిగా విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలతో స్థానిక సుజాత కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం సాయంత్రం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి, పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయడానికి కార్యకర్తలు చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. ఎన్నికల్లో ఓటమి కొంత నిరాశకు గురిచేసినా.. గెలుపోటములు సహజమన్నారు. విజయనగరం నియోజకవర్గ అభివృద్ధికి కోలగట్ల వీరభద్రస్వామి అకుంఠిత దీక్షతో పని చేశారని కొనియాడారు. 365 రోజులు ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచారన్నారు. కూటమి నేతల హామీలకు ప్రజలు ఆకర్షితులై ఓట్లు వేశారని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు ఓటమికి కుంగిపోకుండా మరింత ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా, ఏ అవసరమొచ్చినా పార్టీ, నాయకులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఫలితాల అనంతరం జరుగుతున్న పరిణామాలు ఆందోళనకరంగా ఉన్నాయని, ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. గెలుపు ఉత్సాహంలో కూటమి నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో విజయనగరం కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పార్టీ నాయకులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్పొరేటర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణం తీర్చుకుంటాను..

సుదీర్ఘ రాజకీయ జీవితంలో తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తల రుణం తీర్చుకుంటాను. దేశ చరిత్రలో అవినీతికి తావులేని విధంగా పాలన సాగించాం. ఓటమితో కృంగిపోకుండా మరింత ఉత్సాహంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం. కార్యకర్తలు సంయమనం పాటిస్తూ ప్రజలకు అండగా నిలవాలి.

– కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ డిప్యూటీ స్పీకర్



పార్టీని పటిష్టం చేద్దాం..



పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పాదాభివందనం తెలియజేస్తున్నా. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పోరాడాలి. సమర్థవంతమైన నాయకత్వంతో ముందుకు సాగి మరలా విజయం సాధిద్దాం. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం.

– బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎంపీ

ప్రజా సమస్యలపై పోరాడుదాం..

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ప్రజాతీర్పును గౌరవిస్తామని, నిత్యం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తామని, ఎవరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఎస్.కోట ఎమ్మెల్యేగా ఎన్నికైన కోళ్ల లలితకుమారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలను గుర్తించి అందుకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. బాధ్యత గల ప్రతిపక్ష పార్టీగా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పార్టీ పెద్దలు బొత్స సత్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు సూచనలతో అంతా కలిసి భవిష్యత్ కోసం పనిచేయాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ ఓటమిపై కారణాలను విశ్లేషించారు. టీడీపీ మేనిఫెస్టో ప్రజల్ని ఆకర్షించి ఉండొచ్చని, వైఎస్సార్‌సీపీ కన్నా ఎక్కువ సంక్షేమ పథకాలు టీడీపీ అమలు చేస్తుందని ప్రజలు ఆశపడి ఉండవచ్చన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసే అవకాశం ఇచ్చిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటామని, ప్రజల తరఫున ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు నిలుపుకుని, ప్రజల బాగు కోసం పనిచేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు పినిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ డోల కనకమహాలక్ష్మి, క్రిష్టాపురం సర్పంచ్ యామినీదేవి, పార్టీ నాయకులు వాకాడ రాంబాబు, సాంబరాజు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై బి.లోకేశ్వరరావు

మెరకముడిదాం: రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇతర పార్టీల వారిని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై బి.లోకేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా సోదర భావంతో కలిసిమెలిసి మెలగాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పీఏసీఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా

గుర్ల: మండలంలోని తెట్టంగి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు తిరుమలరాజు రవిబాబు తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ బెల్లాన రామునాయుడుకు శుక్రవారం అందజేసినట్లు చెప్పారు. వ్యక్తిగత కారణాల వల్ల సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. రవిబాబు రాజీనామా పత్రాన్ని డీసీసీబీ సీఈఓకు అందజేస్తానని సొసైటీ సీఈఓ రామునాయుడు తెలిపారు.

వైభవంగా నూకాలమ్మ పండగ

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కునాయుడుపేట గ్రామంలో గ్రామదేవత నూకాలమ్మ అమ్మవారి పండగ అనుపోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ నెల 2న గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి పండగ చాటింపు చేశారు. 15 ఏళ్ల తరువాత పెద్ద పండగ చేస్తుండటంతో ఈ లోగా ఇతర అమ్మవార్లకు గ్రామస్తులు మొక్కులు చెల్లిస్తూ ఉత్సవాలు చేసుకుంటున్నారు. ఈ నెల 11న మంగళవారం పెద్ద పండగ నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామదేవత ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వైద్య సేవలు పక్కాగా అందించాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



పురిటిపెంట–2 సచివాలయంలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గజపతినగరం రూరల్: తల్లీబిడ్డలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని వైద్య సేవలు పక్కాగా అందించాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు అన్నారు. మండలంలోని పురిటిపెంట–2 సచివాలయంతో పాటు భూదేవిపేటలోని హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పీఎం మాతృత్వ వందన యోజన, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాతాశిశు ఆరోగ్య సేవలు పక్కాగా అందేలా చూడాలన్నారు. ప్రతీ గర్భిణీ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా చూడాలన్నారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణ, వైద్య సిబ్బంది కళ్యాణి, మూర్తి, ఎం.పైడన్న, జానకి, సంతోషి, సత్యవతి, తదితరులు ఉన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

గ్రంథాలయాల్లో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. విద్యార్థులు వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞాన్ని పెంచుకునేలా మే నెల 15 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతిరోజు విద్యార్థులతో కథలు చదివించడం, స్టోరీ టెల్లింగ్, చిత్రలేఖనం, పాటలు పాటించడం, ఆటలు ఆడించడం వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. శాస్త్ర సాంకేతిక రంగాలు, దేశనాయకుల జీవిత విశేషాలను ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ భానుప్రకాష్, లైబ్రేరియన్ రామారావు



లక్కవరపుకోట: విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న లైబ్రేరియన్ మేరీ నిర్మల



వేపాడ: విజేతలకు బహుమతులు అందచేస్తున్న లైబ్రేరియన్ చంద్రశేఖర్



కొత్తవలస: ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న లైబ్రేరియన్ రామలక్ష్మి



చీపురుపల్లి రూరల్(గరివిడి): విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రామారావు



చీపురుపల్లి: రిసోర్స్ పర్సన్లను సత్కరిస్తున్న గ్రంథాలయాధికారి బుచ్చింనాయుడు

నిరంతర పర్యవేక్షణ అవసరం

- ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి

గంట్యాడ: అంగన్‌వాడీ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ జి.చిన్మయిదేవి అన్నారు. మండల కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు అధిక సంఖ్యలో హాజరయ్యేటట్లు చూడాలని సూచించారు. పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. అలాగే లబ్ధిదారులకు పౌష్టికాహారం పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ డోకుల ఉమాభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద వసతులు తప్పనిసరి



దత్తిరాజేరు: రామచంద్రాపురంలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి



బొండపల్లి: వెదురువాడలో మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ఉపాధిహామీ పనుల వద్ద తాగునీరు, టెంట్లు, తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సూచించారు. మండలంలోని వెదురువాడలో ఉన్న వట్టిచిన్నచెరువులో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీరు, నీడ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించడంతో పాటు, జాబ్‌కార్డు లేని వారికి కార్డు మంజూరు చేయాలని ఆదేశించారు. పనులకు ఒకరికి బదులుగా వేరొకరు రాకుండా చూడాలన్నారు.

కొలతల మేరకు పనులు చేపట్టాలి

దత్తిరాజేరు: మండలంలోని రామచంద్రాపురం చెరువులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ చంద్రకుమారి శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్లను తనిఖీ చేసి వారితో మాట్లాడారు. రెండు పూటలా పనిచేయాలని, ఇచ్చిన కొలతలు పూర్తిచేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి



గజపతినగరంలో అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న కళాశాల సిబ్బంది

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని వైస్ ప్రిన్సిపాల్ పద్మలత అన్నారు. ఇంటర్మీడియట్ పాసై, డిగ్రీలో చేరాలనుకునే విద్యార్థులు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. గజపతినగరం, పురిటిపెంట గ్రామాల్లో శుక్రవారం అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, వసతులపై విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు ఫీజుతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నామన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ చల్లా శ్రీనివాసరావు, అధ్యాపకులు విజయదుర్గ, శాంతిప్రియ, శ్రీనివాస్, భాను, తదితరులు పాల్గొన్నారు.

పశువుల టీకాలు అందుబాటులో ఉండాలి

- పశువైద్యశాఖ ఏడీ ఆర్.శారద



మెరకముడిదాం పశువైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ శారద

మెరకముడిదాం: పశువులకు అవసరమైన టీకాలను అందుబాటులో ఉంచాలని పశువైద్యశాఖ ఏడీ ఆర్.శారద ఆదేశించారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలను పరిశీలించారు. పశువులు, గొర్రెలు, మేకలకు సంబంధించిన అన్ని టీకాలు, మందులను ఆస్పత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారి సీహెచ్.హైమావతికి సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అనంతరం భీమవరంలో ఉన్న వెటర్నరీ సబ్‌సెంటర్‌ను ఆమె సందర్శించారు. అక్కడి రికార్డులు, అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట మెరకముడిదాం వెటర్నరీ అసిస్టెంట్ శంకరరావు, సిబ్బంది ఉన్నారు.

2025 నాటికి క్షయవ్యాధి రహిత రాష్ట్రంగా ఏపీ



క్షయవ్యాధి నివారణ టీకా కార్యక్రమంపై వైద్యాధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టి.రమేష్

కొత్తవలస: ఆంధ్రప్రదేశ్‌ను 2025 నాటికి క్షయవ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని క్షయవ్యాధి నిర్మూలన విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ తెలిపారు. ప్రస్తుతం పైలెట్ ప్రోగ్రాంలో భాగంగా వయోజనులకు వేస్తున్న క్షయవ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని కొత్తవలస పీహెచ్‌సీలో శుక్రవారం పరిశీలించారు. వైద్యాధికారులు సీతల్‌వర్మ, సీతామహలక్ష్మితో మాట్లాడి టీకా కార్యక్రమ వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ టీకాలు వేయాలని సూచించారు. టీకాలు వేసుకునేందుకు నిరాకరించేవారికి అవగాహన కల్పించాలన్నారు. టీకా వేయడంలో రాష్ట్రంలోనే విజయనగరం ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. క్షయవ్యాధి లేని సమాజం కోసం విద్యావంతులు, గ్రామ పెద్దలు, పత్రికా విలేకరులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృప, పీహెచ్‌ఎన్ రమణమ్మ, క్షయవ్యాధి నివారణ సూపర్ వైజర్ శ్రీనివాస్, హెచ్‌సీ సూరిదేముడు, తదితరులు పాల్గొన్నారు.